# వేతన సవరణ పై ఉద్యోగులకు విజ్ఞప్తి

## మోసపోకండి

వేతన సవరణ చర్చలు నిర్ణయాత్మక స్థాయికి చేరుకున్నాయి. వేతన సవరణ వెంటనే పూర్తి కావాలని ఉద్యోగులందరిలో బలీయమైన కోర్కె వుంది. ఉద్యోగులలో ఉన్న ఈ బలమైన కోర్కెను వాడుకుని తక్కువ ప్రయోజనం గల వేతన సవరణను ఇవ్వాలని మేనేజ్‌మెంటు మరియు దాని చెప్పుచేతల్లో వుండే కొంతమంది యూనియన్ నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి దుష్ట పన్నాగాలలో చిక్కుకుని మోసపోవద్దని ఉద్యోగులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

## కొత్త అనుభవం

1.10.2000 దాకా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా వుండటం వల్ల, మన వేతన సవరణలన్నీ పే కమీషన్ ద్వారా పది సంవత్సరాలు లేదా అంతకు మించిన కాలపరిమితితో వచ్చాయి. పే కమీషన్‌లన్నీ అధికారులకి మరియు ఉద్యోగులకి కలిసి వుండటం మూలంగా, అందరికీ కలిసి ఒకేసారి వేతన సవరణ మరియు వేతన అరియర్సు లభించేవి. కానీ, 1.10.2000 తర్వాత మనం ప్రభుత్వరంగ ఉద్యోగులుగా మారటం వల్ల 'పే కమీషన్' ప్రభుత్వరంగ ఉద్యోగులకి వర్తించదు. ప్రభుత్వరంగ సంస్థలలోని అధికారుల వేతన సవరణ మాత్రం అందుకోసం నియమించబడే వేతన సవరణ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించిన తర్వాత అమలవుతాయి. ఇందుకు భిన్నంగా ఉద్యోగుల వేతన సవరణ గుర్తింపు యూనియన్‌తో చర్చల అనంతరం వుంటుంది. కాబట్టి అధికారుల వేతన సవరణ, ఉద్యోగుల వేతన సవరణ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణలాగా ఒకేసారి జరగటం సాధ్యం కాదు. అందుకే ఇది మనకు ఒక కొత్త అనుభవం. అందుకే మనం ఈ విషయాన్ని అర్థం చేసుకొని, మేనేజ్‌మెంటు మరియు దాని ఏజెంట్ల కుట్రలో పడిపోకుండా వుండాలి.

## ప్రభుత్వరంగ సంస్థలలో గత వేతన సవరణ అనుభవాలు

1.1.1997లో ప్రభుత్వరంగ సంస్థలలో జరిగిన గత వేతన సవరణను గమనిస్తే అధికారులకూ, ఉద్యోగులకు జరిగిన వేతన సవరణలో చాలా వివక్షత చూపబడింది. అధికారులకు దాదాపు 80% ఫిట్‌మెంట్ బెనిఫిట్ వారి మూలవేతనంలో రాగా, అదే ఉద్యోగులకు వారి మూల వేతనంపై కేవలం 20% నుండి 40% ఫిట్‌మెంట్ బెనిఫిట్ లభించింది. అధికారులకు బంచింగ్ రాకుండా వుండటానికి అడిషనల్ ఇంక్రిమెంట్లు రాగా, ఉద్యోగులకు ఈ బెనిఫిట్ నిరాకరించబడింది.

## సిపిఎస్‌టియు నిర్ణయం

పై అనుభవాన్ని గుర్తించిన వివిధ ప్రభుత్వరంగ సంస్థలలోని అనేక యూనియన్ల సమన్వయ కమిటీ (ఈ కమిటీలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ కూడా సభ్యురాలే) ఈసారి జరిగే వేతన సవరణ చర్చలలో అధికారులకు, ఉద్యోగులకు వేతనాల వృద్ధిలో ఎలాంటి వివక్ష వుండకూడదని తీర్మానించాయి. అలాగే ఈ సమన్వయ కమిటీలో చేసిన మరో తీర్మానం ఏమిటంటే అధికారులకు ఎలాంటి వేతనవృద్ధి, ఇతర బెనిఫిట్లు వస్తాయో వేచి చూసి, ఆ తరువాతనే వేతన చర్చలు ప్రారంభించాలని, అధికారుల వేతనవృద్ధిపై ఉత్తర్వులు వెలువడిన తర్వాతనే ఈ ప్రక్రియ ప్రారంభించి అధికారులతో సమానంగా వేతనవృద్ధి సాధించాలని నిర్ణయించారు.

## మన నిర్ణయానికే విజయం

అధికారుల మరియు ఉద్యోగుల మధ్య వేతన సవరణ విషయంలో అనుసరిస్తున్న వివక్షతను తొలగించాలని మనము చేసిన పోరాటాలు, దానికి తోడు అధికారుల వేతన సవరణపై ఉత్తర్వులు వచ్చే వరకూ, చర్చలు ప్రారంభించ కూడదని మనం చేసిన నిర్ణయం వల్ల మంచి ఫలితాలు వచ్చాయి. 2009 మార్చిలో జరిగిన మొదటి విడత చర్చలలోనే, అధికారులతో సమానంగా ఉద్యోగులకు 30% ఫిట్‌మెంట్ బెనిఫిట్ ఇస్తామని మేనేజ్‌మెంటు ప్రతిపాదించింది. ఇది మనం సాధించిన విజయం.

## కాలపరిమితి సమస్య

అధికారులకు ఇచ్చిన ఉత్తర్వులలో వారి వేతన సవరణ కాలపరిమితి ఎంతో చెప్పలేదు. దీనిని రాబోయే కాలంలో డిపిఇ నిర్ణయిస్తుందని అన్నారు. కానీ ఉద్యోగులు మాత్రం అధికారులతో సమంగా 30% ఫిట్‌మెంట్ బెనిఫిట్ కావాలంటే 10 సంవత్సరాల కాలపరిమితిని ఒప్పుకోవాలని మేనేజ్‌మెంట్ వాదించింది. 5 సం॥ల కాలపరిమితి అయితే ఫిట్‌మెంట్ బెనిఫిట్ 30% కన్నా తక్కువ ఇస్తామని పేర్కొంది. కాని సిపిఎస్‌టియు ఆధ్వర్యంలో ప్రభుత్వరంగ సంస్థల యూనియన్లు 5 సంవత్సరాల కాలపరిమితితో 30% ఫిట్‌మెంట్ బెనిఫిట్ సాధించేందుకు పోరాడటం జరిగింది. ఇందుకు అనుగుణంగానే 5 సం॥ల కాలపరిమితి మరియు 30% ఫిట్‌మెంట్ బెనిఫిట్ కోసం ఆగస్టు 19, 20 రెండు రోజుల సమ్మెకి బిఎస్ఎన్ఎల్ఇయు పిలుపునిచ్చింది. ఈ సమ్మెలో 50% పైగా ఉద్యోగులు పేర్కొన్నారు.

ఉద్యోగులందరి ప్రయోజనం కోసమే ఈ సమ్మె జరిగినప్పటికే బిఎస్ఎన్ఎల్‌లోని ఇతర యూనియన్లు కలిసి రాలేదు. కలిసి రావాలని బిఎస్ఎన్ఎల్ఇయు పిలుపునిచ్చినా నిరాకరించాయి.

అనేక ఇతర ప్రభుత్వరంగ సంస్థలలో అన్ని యూనియన్లు కలిసి 5 సంవత్సరాల కాలపరిమితి ఒప్పందం సాధించేందుకు పోరాడుతున్నామని ఈ సందర్భంగా మనం గమనించాలి.

## డి.ఎ. విలీనం పై ఫిట్‌మెంట్ బెనిఫిట్

డి.పి.ఇ. 26.11.2008న పే+68.8% డి.ఎ. పై 30% ఫిట్‌మెంటు బెనిఫిట్ 1.1.2007 నుండి అధికారులకు ఇస్తూ వుత్తర్వులు జారీ చేసింది. తదనుగుణంగా బిఎస్ఎన్ఎల్ మేనేజ్‌మెంటు కూడా తన అధికారులకు పే+68.8% డి.ఎ. పై 30% ఫిట్‌మెంట్ బెనిఫిట్ 1.1.2007 నుండి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తరువాత డి.పి.ఇ., పే+78.2% డి.ఎ. పై 30% ఫిట్‌మెంట్ బెనిఫిట్‌ని ఇస్తూ 2.4.2009న రివైజ్డ్ ఉత్తర్వులు ఇచ్చింది. (1.1.2007 నాటి 50% డిఎ విలీనాన్ని పరిగణనలోనికి తీసుకుంటే పే+78.2% డిఎ వస్తుంది.) కానీ బిఎస్ఎన్ఎల్ మేనేజ్‌మెంటు మాత్రం 2.4.2009 నాటి ఈ ఉత్తర్వులను తన అధికారులకు అమలు చేయలేదు. అధికారులకు పే+68.8% డి.ఎ.పై మాత్రమే ఇచ్చాం కనుక ఉద్యోగులకు కూడా అదే విధంగా ఇస్తామని, పే+78.2% పై ఇవ్వడం కుదరని బిఎస్ఎన్ఎల్ మేనేజ్‌మెంట్ అంటున్నది. ఇందుకు భిన్నంగా ఇతర ప్రభుత్వరంగ సంస్థలలో అధికారులు మరియు ఉద్యోగులకు అందరికీ పే+78.2% డి.ఎ. పై ఫిట్‌మెంట్ బెనిఫిట్ ఇచ్చారు. అందువల్లనే దీనిని సాధించడం కోసం బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ 19, 20 ఆగస్టు 2009 తేదీలలో సమ్మె పిలుపు ఇచ్చింది.

## 13.10.2009న జరిగిన వేతన సవరణ చర్చలలో మేనేజ్‌మెంట్ ప్రతిపాదనలు

సమ్మె విజయవంతమైన తర్వాత కూడా, బిఎస్ఎన్ఎల్ మేనేజ్‌మెంటు పే+78.2% డి.ఎ. పై 30% ఫిట్‌మెంట్‌తో ఐదు సంవత్సరాల కాలపరిమితితో వేతన సవరణకు తిరస్కరించింది.

13.10.2009 నాటి వేతన సవరణ చర్చలలో మేనేజ్‌మెంట్ పే+68.8% డి.ఎ. పై 30% ఫిట్‌మెంట్ బెనిఫిట్‌తో 10 సంవత్సరాల కాలపరిమితితోనే వేతన సవరణ జరుపుతామని చెప్పింది. కానీ గతంలోలాగా కాకుండా మన సమ్మె ఒత్తిడి ఫలితంగా మేనేజ్‌మెంటు ఈ క్రింది పెరుగుదలకు ప్రతిపాదించింది.

అ) వేతన సవరణ కాలపరిమితి 10 సంవత్సరాలుగానే వుంటుంది. అయితే అధికారులకు వేతన సవరణ కాలపరిమితి 10 సంవత్సరాల కంటే తగ్గించే పక్షంలో అదే విధంగా ఉద్యోగులకి వర్తింపజేస్తారు.

ఆ) 5 సంవత్సరాలు పూర్తయిన తర్వాత (అంటే 1.1.2012న) తిరిగి వేతన సవరణ జరిపే విషయమై రెవ్యూ వుంటుంది. ఈ రెవ్యూ బిఎస్ఎన్ఎల్‌కు 1010-11, 2011-12, మరియు 2012-13 సంవత్సరాలలో వచ్చే లాభాల మీద ఆధారపడి వుంటుంది. ఏ విధమైన కండీషన్లకు లోబడి వేతన సవరణ వుండాలి అన్నది చర్చించి నిర్ణయిస్తారు.

ఇ) పే+68.8% డి.ఎ. పై 30% ఫిట్‌మెంట్ అధికారులతో సమానంగా ఇస్తారు. అధికారులకు పే+78.2% డి.ఎ. పై 30% ఫిట్‌మెంట్ ఇస్తే, ఉద్యోగులకి కూడా అదే సూత్రం వర్తింపజేస్తారు.

### మన డిమాండు

13.10.2009న జరిగిన వేతన సవరణ చర్చలలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ తన వాదనలో అధికారుల వేతన సవరణ ఉత్తర్వులలో ఎలాంటి కాలపరిమితి లేని కారణంగా ఉద్యోగుల విషయంలో 10 సంవత్సరాల విషయం ప్రస్తావించరాదని డిమాండ్ చేసింది. అయితే అధికారుల విషయంలో డిపిఇ ఉత్తర్వులలోనే, కాలపరిమితి అంశం లేని కారణంగా ప్రస్తావన లేదనీ, తిరిగి డిపిఇ ఉత్తర్వుల ప్రకారమే అధికారులకి వేతన సవరణ కాలపరిమితిని నిర్ణయిస్తారనీ మేనేజ్‌మెంట్ పేర్కొంది. కానీ ఉద్యోగుల విషయంలో 5 సంవత్సరాల నుండి 10 సంవత్సరాల కాలపరిమితిని డిపిఇ గైడ్‌లైన్స్‌లో ఇచ్చిన దృష్ట్యా, కాలపరిమితిని తప్పక పేర్కొనాలని మేనేజ్‌మెంట్ వాదించింది. అయితే ఉద్యోగులకు భరోసా కల్పించడం కోసం వేతన ఒప్పందంలో అధికారులకు 10 సంవత్సరాల కంటే తక్కువ సమయంలో వేతన సవరణ జరిగితే ఉద్యోగులకు కూడా అదే సూత్రం వర్తింపజేసేలా ఒక కండీషన్ రూపొందించుకుందామని మేనేజ్‌మెంట్ పేర్కొంది. అయితే వేతన ఒప్పందంలో ఎలాంటి కాలపరిమితిని పేర్కొనకుండా, అధికారులతో పాటు వేతన ఒప్పందం వుంటుందని పేర్కొంటే చాలని యూనియన్ వాదించింది. ఈ విషయమై మేనేజ్‌మెంటు ఆలోచించి తన వైఖరిని తరువాతి వేతన చర్చల మీటింగులో వెల్లడించే ఆస్కారం వుంది.

వేతన సవరణ వెంటనే జరగాలన్న ఉద్యోగుల కోర్కెని మేనేజ్‌మెంట్‌గానీ, దాని ఏజెంట్లుగానీ దుర్వినియోగం చేసే అవకాశం కల్పించరాదు. అధికారులకు రెండవ విడత వేతన సవరణ అరియర్సు చెల్లింపులు జరిగిన తర్వాత ఉద్యోగులలో వేతన సవరణ ఒప్పందం వెంటనే జరగాలన్న కోరిక పెరిగింది.

బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ కూడా వెంటనే వేతన సవరణ జరగాలని కోరుకుంటోంది. అదే విధంగా ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో వేతన పెరుగుదల వెంటనే జరగాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు. అయితే ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా వాడుకుని మేనేజ్‌మెంటు మరియు దాని ఏజెంట్లు హేతుబద్ధం కాని వేతన సవరణని ఉద్యోగులపై రుద్దాలని చూస్తున్నారు. 5 సంవత్సరాల కాలపరిమితితో కూడిన వేతన ఒప్పందాన్ని సాధించే దిశగా సాగుతున్న బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రయత్నాలకు గండి కొడుతున్నారు. వారి వాదనంతా ఒక్కటే, ఉద్యోగులు వేతన సవరణ వెంటనే జరగాలని కోరుకుంటున్నారు కనుక మేనేజ్‌మెంటు ఏం చెప్పినా దానికి వెంటనే అంగీకరించాలని. దీనికి సమర్థనగా వారు చేసే వాదన ఏమిటంటే మేనేజ్‌మెంటు అధికారులతో సమానంగా వేతన సవరణ ఇస్తానన్నా బిఎస్ఎన్ఎల్ఇయు అంగీకరించకుండా అనవసరంగా ఆలస్యం చేస్తోందని. ఇక్కడే వారు ఒక అంశాన్ని తెలివిగా దాచి పెడుతున్నారు. అదేమిటంటే అధికారుల వేతన సవరణకు కాలపరిమితి లేదు, అయినా ఉద్యోగులకు 10 సంవత్సరాల వేతన సవరణ కాలపరిమితిని మేనేజ్‌మెంటు రుద్దాలని చూస్తుంటే దాన్ని వీరు సమర్థించడం. ఈ తేడాని జాగ్రత్తగా అర్థం చేసుకోగల్గితే మేనేజ్‌మెంట్ మరియు దాని తాబేదార్లు పన్నిన ఈ ఉచ్చులో మనం చిక్కుకోం.

## విజ్ఞప్తి

ఇతర ప్రభుత్వరంగ సంస్థలలోని యూనియన్లతో కలిసి సిపిఎస్‌టియు ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు, పోరాటాలు చేయడం ద్వారా వేతన సవరణకు సంబంధించిన ఈ క్రింది అంశాలను బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఇప్పటికే సాధించింది.

అ) ఇతర మేనేజ్‌మెంట్ల మాదిరిగానే, బిఎస్‌ఎన్‌ఎల్ మేనేజ్‌మెంట్ కూడా అధికారులకు ఇచ్చిన ఫిట్‌మెంట్ బెనిఫిట్ 30%తో సమానమైన ఫిట్‌మెంట్ బెనిఫిట్‌ని ఉద్యోగులకు ఇస్తామని చెప్పేలా చేయగలిగాం. అయితే కాలపరిమితి 10 సంవత్సరాలుగా పేర్కొనాలని మేనేజ్‌మెంటు ప్రయత్నిస్తున్నా ఫిట్‌మెంట్ విషయంలో విజయం సాధించగలిగాం.

ఆ) ఇంక్రిమెంటును పర్సెంటేజీ రూపంలోనే ఇవ్వాలన్న డిమాండ్లను అన్ని ప్రభుత్వరంగ సంస్థల మేనేజ్‌మెంట్లు, బిఎస్‌ఎన్‌ఎల్ మేనేజ్‌మెంటుతో సహా అంగీకరించాయి. అధికారులకు అన్ని ప్రభుత్వరంగ సంస్థలలో ఇంక్రిమెంటును 3%గా నిర్ణయించారు. ఉద్యోగులకు కూడా బిఎస్‌ఎన్‌ఎల్ మేనేజ్‌మెంటు 3% ఇంక్రిమెంటు ఇస్తామని ప్రతిపాదించింది. దీనివల్ల ప్రతి సంవత్సరం ఇంక్రిమెంటు బెనిఫిట్ పెరిగే అవకాశం వుంటుంది.

ఇ) 1.1.2007 నుండి 50% డి.ఎ. విలీనం.

ఈ) ఇంటిరీమ్ రిలీఫ్‌గా ఆరు నెలల మూలవేతనం చెల్లింపు.

ఉ) కొంతమంది మేనేజ్‌మెంట్ ఏజెంట్లు ఏం చెపుతున్నారంటే, వేతన సవరణ ఒప్పందం ఆలస్యం అయితే ఇంటి అద్దె అలవెన్సు ఒప్పందం కుదిరిన తేదీ నుంచి మాత్రమే ఇస్తారనీ, దీనివల్ల ఉద్యోగులకి నష్టం జరుగుతుందని చెబుతున్నారు. ఇది పచ్చి అబద్ధం. 50 లక్షల జనాభా కలిగిన పట్టణాలకు 30% హెచ్‌ఆర్‌ఎ, 5- 50 లక్షల మధ్య జనాభా కలిగిన పట్టణాలకు 20% హెచ్‌ఆర్‌ఎ, మిగిలిన ప్రాంతాలకు 10% హెచ్‌ఆర్‌ఎ 27.2.2009 నుంచి చెల్లించే విధంగా బిఎస్‌ఎన్‌ఎల్ మేనేజ్‌మెంట్ నుండి మనం ఇప్పటికే ఆదేశాలు సాధించాం.

**వీరు ప్రచారం చేసే మరో అంశం ఛైర్మన్ బిఎస్‌ఎన్‌ఎల్ ఈ నెలలోనే రిటైరవుతున్నారనీ (ఈ పుకారు ఇప్పటికి కొన్ని నెలలుగా చెపుతున్నారు) కనుక ఆయన రిటైరయితే, కొత్త ఛైర్మన్ వస్తే వేతన ఒప్పందం మరింత ఆలస్యం అవుతుందని చెబుతున్నారు. నిజానికి ఛైర్మన్, బిఎస్‌ఎన్‌ఎల్ జులై 2010లో రిటైరవుతున్నారు.**

పై సాధించిన అంశాలకు అదనంగా 10 సంవత్సరాల కాలపరిమితితో కాకుండా, ఐదు సంవత్సరాల కాల పరిమితితో వేతన ఒప్పందం కుదిరేలా చూడాలని బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ కృషి చేస్తోంది. అయితే కొంతమంది మేనేజ్‌మెంటు తాబేదార్లు యూనియన్ నాయకులుగా చెలామణి అవుతూ మన చుట్టూ తిరుగుతూనే మంచి ఒప్పందాలను చెడగొట్టాలని చూస్తున్నారు.

కుట్రపూరితమైన, దురుద్దేశంతో కూడుకున్న ఈ ప్రచారాలకి లొంగకుండా బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ చేస్తున్న కృషికి మద్దతు ఇవ్వవలసినదిగా, మంచి వేతన ఒప్పందాన్ని సాధించేందుకు తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

అయితే వెంటనే వేతన సవరణ ఒప్పందం జరగాలన్న ఉద్యోగుల కోర్కెని యూనియన్ గుర్తించింది. అధికారులకు మొత్తం పెరిగిన వేతన చెల్లింపులు జరిగిన పరిస్థితులలో ఈ కోర్కె చాలా న్యాయమైనది. దీనిని డిమాండ్‌ని దృష్టిలో ఉంచుకునే వెంటనే, మంచి వేతన ఒప్పందం జరిగేందుకు బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ కృషి చేస్తుంది.

(తదుపరి వేతన చర్చలు 17.11.2009న జరుగుతాయి)

*అభినందనలతో...*

BSNLEU

**బి.ఎస్.ఎన్.ఎల్. ఎంప్లాయీస్ యూనియన్**

**.......................................టెలికం జిల్లా**